
12వ తేదీ వరకు ఐటీఐల్లో అడ్మిషన్లు

మేడ్చల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కోర్సుల్లో అడ్మిషన్లకు ఈ నెల 12వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రభుత్వ ఐటీఐల జిల్లా కన్వీనర్, అల్వాల్ ఐటీఐ ప్రిన్స్‌పాల్ పి.శంకరయ్య శనివారం పేర్కొన్నారు. అల్వాల్, మేడ్చల్ ఐటీఐల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్/డీజిల్ మెకానికల్ తదితర కోర్సులున్నాయని తెలిపారు. అడ్మిషన్లకు టెన్త్/8వ తరగతుల్లో పాసైన విద్యార్థినీవిద్యార్థులు అర్హులని ఈ సందర్భంగా తెలిపారు.


మేడ్చల్ పట్టణ ఏరియల్ వ్యూ

అభివృద్ధి జాడేది?

కొత్త ప్రభుత్వంలో మేడ్చల్ జిల్లా ప్రగతిపై నిర్లక్ష్యం

- కాంగ్రెస్ పాలనలో ఊపందుకోని పనులు
- కొన్ని ప్రాంతాలకే అభివృద్ధి పరిమితం
- నామ్‌కే వాస్తేగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి

మేడ్చల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): దశాబ్ద బీఆర్ఎస్ పాలనలో ఒక వెలుగు వెలిగిన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అభివృద్ధి కాంగ్రెస్ పాలనలో 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా మారింది. నగరానికి అనుకొని ఉన్న ప్రాంతాలను అభివృద్ధి పర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వైపు కొత్తకొత్త ఆలోచనలతో ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపడుతుండగా మేడ్చల్ జిల్లా గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా పరిధి అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నా పాలనా వ్యవహారాలను మాత్రం కాంగ్రెస్ బడా నాయకులు ముందుండి నడుపుతున్నారు. ఈ పాలన కొన్ని ప్రాంతాలకే పరిమితమవడంతో ప్రజావసరాల మేరకు అభివృద్ధి జరగటం లేదన్న వాదనలు బలంగా విన్పిస్తున్నాయి. మేడ్చల్ నియోజకవర్గంలో 9మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు, ఐదు మండలాల్లోని 61 గ్రామ పంచాయతీల్లో కొత్తగా అభివృద్ధి పనులేవీ లేక ప్రజలు నిరాశలో ఉన్నారు. స్థానిక కాంగ్రెస్ బడానాయకులు అంతా తామై కార్యకలాపాలు చేపడుతున్నారు. వీరు అభివృద్ధిని కొన్ని చోట్లనే కేంద్రీకరిస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా పనులు జరగని పరిస్థితి నెలకొంది. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌లు తమ సొంత ప్రాంతాలను తప్ప ఇతర ప్రాంతాల అభివృద్ధి గురించి పట్టించుకోవటం లేదని సొంత పార్టీ నాయకులే ఆరోపిస్తుండడం గమనార్హం. ఈ నలుగురు నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సన్నిహిత సంబంధాలున్నప్పటికీ జిల్లా అభివృద్ధికి వారు తపనపడడం లేదన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

> మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అభివృద్ధిలో వెనకబడుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒక్కరూ లేకపోవడం ఓ కారణమైతే.. జిల్లా సమగ్ర అభివృద్ధిపై కాంగ్రెస్ నేతలు పెద్దగా దృష్టి సారించకపోవడం మరో కారణంగా చెబుతున్నారు. పాలక పార్టీకి చెందిన బడా నేతలు వారికి స్థానికంగా పట్టున్న ప్రాంతాలపైనే శ్రద్ధ పెడుతున్నారనే విమర్శలొస్తున్నాయి. ప్రభుత్వ పరంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమస్యలను తీర్చడంలో నేతలు క్రియాశీలకంగా వ్యవహరించడం లేదని కాంగ్రెస్ క్యాడరే లోలోన చర్చించుకుంటోంది. నగరానికి ఆనుకొని ఉన్న జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ప్రజలు, పార్టీ కార్యకర్తలు కోరుకుంటున్నారు. ఔటర్ రింగురోడ్డు విస్తరించి ఉన్న జిల్లాలో ప్రభుత్వం తలుచుకుంటే ఎంతో అభివృద్ధి చేయొచ్చు.

గ్రామీణ ప్రాంతాల స్థితి దయనీయం

మండల పరిషత్, పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసిన నాటి నుంచి ప్రత్యేకాధికారులు వచ్చినా గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు చొరవచూపడం లేదు. కాంగ్రెస్ నేతలు తమ ఉనికి కోసమే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు తప్పితే ప్రభుత్వ పరంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయటం లేదనే అసంతృప్తి వ్యక్తం అవుతోంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో స్థానికంగా చిన్నచిన్న పనులు చేపడుతున్నారు. కొత్త ప్రభుత్వంలో రాష్ట్రంలోని మిగతా జిల్లాలు, పట్టణాలు, నగరాల్లో జరుగుతున్నంత వేగంగా అభివృద్ధి పనులు చేయడం లేదని ప్రజలు, పార్టీ క్యాడర్‌లో నిరాశ మిగులుతోంది.

జిల్లాలో పర్యటించని ఇన్‌చార్జి మంత్రి

అభివృద్ధి విషయంలో నాయకులు అధికారుల మధ్య సమన్వయం ఏర్పర్చి జిల్లా అభివృద్ధికి కృషిచేయాల్సిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఇప్పటి వరకు జిల్లాలో పర్యటించకపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలను తెలుసుకోవాల్సిన మంత్రి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహించి జిల్లా సమస్యలపై తెలుసుకున్న దాఖలాలు లేవు. కనీసం సొంత పార్టీ నేతలతోనూ మంత్రి సమావేశాలు పెట్టలేదు. ఈ కారణాలతోనే జిల్లా సమస్యలకు మోక్షం లభించటం లేదన్న ఆరోపణలూ వినబడుతున్నాయి. నోరున్నవాడిదే ఊరున్నట్టు.. ఇన్‌చార్జి మంత్రికి సన్నిహితంగా ఉంటున్న జిల్లా నేతలకే ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నారని సొంతపార్టీ నేతలే గుసగుసలాడుతున్నారు!


మొక్కలు నాటుతున్న కాంగ్రెస్ నాయకులు(ఫైల్)

నేతల్లో కొరవడిన సమన్వయం

ప్రస్తుతం జిల్లాలో పాలక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు లేక కాంగ్రెస్ బడానాయకులే ఎమ్మెల్యేలను తలపించేలా ప్రభుత్వ కార్యకలాపాల్లో హల్‌చల్ చేస్తున్నారు. ఉన్న నలుగురు నేతలకూ జిల్లాపై పూర్తిగా అవగాహన లేక వారున్న ప్రాంతాలకే పరిమితమవుతున్నారు. వారు మండలాలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో తిరుగుతున్నా అభివృద్ధి విషయంలో మాత్రం పక్షపాత ధోరణే అవలంభిస్తున్నట్టు తెలుస్తోంది. జిల్లా మొత్తాన్నీ నాయకులు సమ దృష్టితో చూడాల్సి ఉంది. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ పట్టణ ప్రాంతాలపై ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారు. నక్క ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డిలు గ్రామీణ ప్రాంతాలపై దృష్టిసారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరంగా సమ్మిళిత అభివృద్ధి కొరవడిందనే విమర్శలు సైతం వ్యక్తం అవుతున్నాయి.


మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

లే అవుట్ల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలి

మేడ్చల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపల్, పంచాయతీల పరిధి అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి రెగ్యులరైజ్ చేయాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌పై శనివారం హైదరాబాద్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీల పరిధిలో క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ లేని అవుట్ల క్రమబద్ధీకరణను మూడు దశల్లో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు, కమిటీలను వేసుకోవాలని సూచించారు. భూముల క్రమబద్ధీకరణపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

'ధరణి' దరఖాస్తులను పరిష్కరించాలి



జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ తహసీల్దార్లను ఆదేశించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై సీసీఎల్ఏ నుంచి నవీన్ మిట్టల్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనంతరం తహసీల్దార్లతో మాట్లాడారు. తహసీల్దార్‌లు, ఆర్డీవో స్థాయిల్లో పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న వాటిని మొదట పరిష్కరించాలన్నారు. వక్ఫ్, ఇనాం, రక్షణశాఖ, నిషేధిత జాబితా భూముల దరఖాస్తులను తిరస్కరించాలన్నారు. ప్రగతి భవన్ ప్రజావాణిలో ఇస్తున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తిరస్కరిస్తున్న దరఖాస్తుల కారణాలను సహేతుకంగా పేర్కొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు, తహశీల్దార్‌లు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం


శంకర్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి

వికారాబాద్, ఆగస్టు 3 : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ అధ్యాపకుల నియామకం కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ శనివారం తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, కనీసం 50శాతం మార్కులు సాధించాలన్నారు. ఎంపికను కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. పీజీలో మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం ఫిజిక్స్, ఒకేషనల్‌లో కంప్యూటర్ సైన్స్, పెద్దేముల్ జూనియర్ కళాశాలలో తెలుగు మీడియం కెమిస్ట్రీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. జడ్పీ బాలుర పాఠశాల ప్రాంగణంలో గల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.


అనంతగిరిపల్లి ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

'ధరణి' కేసులను సత్వరం పరిష్కరించాలి

- పనులను వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 3: ధరణి పోర్టల్‌లో పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శనివారం వికారాబాద్ ఆర్డీవో కార్యాలయాన్ని, మున్సిపల్ పరిధి అంతగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆర్డీవో కార్యాలయంలో ధరణి సహాయక కేంద్రాన్ని, రికార్డు గదిని ఆయన పరిశీలించారు. అనంతరం అరంతగికిపల్లిలోని ఆరోగ్య కేంద్రం పరిశీలించారు. ఆవరణలో పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రికి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని డీఎంహెచ్‌వోకు కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రికి వచ్చిన ఓ బాలుడి అనారోగ్యంపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వాసుచంద్రం, డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్లు, లే అవుట్లను రెగ్యులరైజ్ చేయాలి

సరళీకృత చెల్లింపు పథకం(ఎల్ఆర్ఎస్) ద్వారా భూములు క్రమబద్ధీకరణకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు పట్టణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి దాన కిషోర్‌లతో కలిసి జిల్లా కలెక్టర్లతో 'సరళీకృత చెల్లింపులతో భూముల క్రమబద్ధీకరణ' విధి విధానాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. మున్సిపల్, పంచాయతీ పరిధిల్లోని అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణను పారదర్శకంగా చేపట్టాలన్నారు. నాలుగు మున్సిపాలిటీల్లో 20,968, పంచాయతీ పరిధిలో 12,745 క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఫీజు తీసుకొని రెగ్యులరైజ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడుతూనే ప్రభుత్వ అనుమతి లేని లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను మూడు దశల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు కమిటీలను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. క్రమబద్ధీకరణకు క్షేత్రస్థాయిలో తప్పకుండా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూముల క్రమబద్ధీకరణపై జిల్లా, మండల, మున్సిపాలిటీల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీపీవో జయసుధ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

భూ సేకరణకు రైతులు సహకరించాలి

కొడంగల్: అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు భూసేకరణకు రైతులు సహకరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధిలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో అప్పాయిపల్లి రైతులతో సమావేశాన్ని నిర్వహించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. భూ సేకరణ చట్టం ప్రకారం భూములు నిర్వాసిత రైతులకు పరిహారం ఇస్తామని తెలిపారు. అలాగే రైతులకు 125గజాల ఇంటి స్థలంతో లే అవుట్ అభివృద్ధి చేసి ఇస్తామన్నారు. అప్పాయిపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న మెడికల్, పశువైద్య కళాశాలల ఏర్పాటుతో అభివృద్ధితో పాటు విద్యార్హత మేరకు నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఉద్యోగాల కల్పనలో సందేహాలు తావులేన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను వినతిపత్రం ద్వారా కలెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహరతి, 'కడ'ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, పశుసంవర్ధకశాఖ అధికారి పూర్ణచందర్‌రావు, డీసీహెచ్‌ఎస్ ప్రదీప్‌కుమార్, కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు


భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

శామీర్‌పేట, ఆగస్టు 3: శామీర్‌పేటలో గల భవానీరామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి మాస శివరాత్రి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గడియారం మురళీధర్‌శర్మ స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మంత్రపుష్పం, అర్చన, తీర్థప్రసాద వితరణ చేశారు. శామీర్‌పేట, తూంకుంటకు చెందిన భజన మండలి బృందం ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ వాసులే కాకుండా సమీప గ్రామాల ప్రజలు పూజల్లో పాల్గొన్నారు. భక్తులు తీర్థప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.


ఆలయంలో మూల విరాట్టు

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఆగస్టు 3: జిల్లాలో విద్యార్థులకు ఇబ్బందులు కలిగించినా, ర్యాగింగ్ చేసినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లాలోని షీ టీం, భరోసా సెంటర్, కళాజాతబృందం అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ షీ టీం, కళాజాత బృందం, భరోసాకేంద్రాలు సమన్వయంతో పని చేయాలన్నారు. అధికారులందరూ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని ఎవరైనా మహిళలను, బాలికలను, పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తే బాధితులకు అండగా షీ టీం ఉందని, లైంగిక వేధింపుల నివారణకు భరోసా కేంద్ర అధికారులు ఉన్నారనే విషయాన్ని ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురైతే పోలీసు అధికారులకు, షీ టీం, భరోసా అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్ని ఇబ్బదులు ఉన్నా ఎవరూ ఆత్మహత్యకు పాల్పడొద్దని సూచంచారు. ఎవరైనా ఆడ పిల్లల జోలికి వెళ్లినా, విద్యార్థులను ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.వీరేందర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ క్రైం కో-ఆర్డినేషన్ సెంటర్ డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి, షీటీం, భరోసా కళాజాత బృందం అధికారులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న సందీప్ శాండిల్య, విద్యార్థులు, పోలీసులు

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 3 : డ్రగ్స్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం యాంటీ డ్రగ్, యాంటీ ర్యాగింగ్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి బారిన పడి జీవితాలను నాశనం చేసుకొవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ మధ్య కాలంలో డ్రగ్ వినియోగం పెద్ద మహ్మారిగా విజృభిస్తోందని, దానికి దూరంగా ఉండాలని, డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాలు సమాజంలో కన్పించకుండా చేయాలన్నారు. అలాగే విద్యార్థులు ఎవరూ తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడొద్దని, విద్యార్థులందరు కలిసిమెలిసి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్, సుబ్బరామిరెడ్డి, ఏసీపీ చక్రపాణి, సీఐ రాజువర్మ, యూనివర్సిటీ సీఈవో నీలిమ, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బీకేఎస్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కోశాధికారి మాణిక్య రెడ్డి

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

పరిగి, ఆగస్టు 3: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులూ లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ కోశాధికారి మాణిక్యరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, పరిగి మండల అధ్యక్షుడు బి.వెంకట్‌రెడ్డిలు అన్నారు. శనివారం పరిగిలోని పాలకేంద్రంలో మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బీకేఎస్ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ అనేక మంది రైతులకు రుణమాఫీ జాబితాల్లో పేర్లు రాక ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతి రైతుకూ ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. తిరిగి కొత్త రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురిచేయద్దని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు సుబ్బారెడ్డి, దామోదర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బురదలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

రోడ్డు బాగు చేయాలని నిరసన

పరిగి, ఆగస్టు 3: పరిగి మునిసిపల్ పరిధిలోని బాలాజీనగర్‌లో రోడ్లు అధ్వానంగా మారినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు శనివారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై నిలిచిన బురదలో కాలనీవాసులు వరినాట్లు వేసి, మునిసిపల్ అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వర్షపునీరు నిలిచి అడుగు ముందుకు వేయని విధంగా రోడ్డు మారినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సొంత డబ్బుతో మట్టిని వేయించుకున్నామని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లను బాగు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.






















రద్దీగా మారిన హైదరాబాద్- శ్రీశైలం హైవే


బారులు తీరిన వాహనాలు

ఆమనగల్లు, ఆగస్టు 3: హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి రద్దీగా మారింది. శ్రీశైలం డ్యామ్ పది గేట్లను ఎత్తడంతో సందర్శకుల తాకిడి భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో శనివారం రహదారిపై వాహనాలు బారులు తీరాయి. కడ్తాల మండలం మైసిగండి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ కన్పించింది. శని, ఆదివారాలు సెలవు కావడంతో వందల సంఖ్యలో కార్లు దర్శనమిచ్చాయి. తుక్కుగూడ, కందుకూరు, కడ్తాల, ఆమనగల్లు మీదుగా పెద్దఎత్తున వాహనాలు శ్రీశైలం వెళ్తుండడంతో హోటళ్లకు గిరాకీ పెరిగింది. మరో వారం రోజులపాటు రద్దీ ఉండే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రమాదాలకు చోటు లేకుండా పోలీసులు, ట్రాఫిక్ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

సర్దార్‌నగర్‌లో కంది - షాద్‌నగర్ రోడ్డుపై ధర్నా


రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు, వ్యాపారులు

షాబాద్, ఆగస్టు 3: విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్దార్‌నగర్ రోడ్డుపై శనివారం రైతులు, వ్యాపారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సర్దార్‌నగర్, కుర్వగూడ, కక్కులూర్ గ్రామాల రైతులు, వ్యాపారస్తులు మాట్లాడుతూ... విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టికోవడంలేదని ఆగ్రహించారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతూ వ్యవసాయానికి ఇబ్బందిగా మారిందన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు విష్ణు, సురేష్, నరేష్, సురేందర్‌రెడ్డి, పాండు, ప్రవీణ్, రాజుగౌడ్, నర్సింహులుగౌడ్, కృష్ణయ్య ఉన్నారు.

రూ.500 కోట్ల విలువైన హెచ్‌ఎండీఏ భూముల కబ్జాకు యత్నం

- ఐదుగురిపై కేసు.. మూడు ఎక్స్‌కవేటర్ల స్వాధీనం
- ముగ్గురి రిమాండ్.. పరారీలో ఇద్దరు
- 50 ఎకరాలు మాయం చేసేందుకు నిందితుల యత్నం
- ఆరు నెలల క్రితమే హెచ్‌ఎండీఏ భూములని తేల్చిన సుప్రీంకోర్టు

శంషాబాద్‌రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దాదాపు రూ.500 కోట్ల విలువైన 50 ఎకరాల హెచ్‌ఎండీఏ భూములను కబ్జా చేయడానికి యత్నించిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం రంగారెడ్డి జిల్లా ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబర్ 725లో 181 ఎకరాల హెచ్‌ఎండీఏ భూములున్నాయి. అయితే, నగరానికి చెందిన మహ్మద్ ఖలీద్, మహ్మద్ షాబాజ్ మూడు ఎక్స్‌కవేటర్లతో శనివారం హెచ్‌ఎండీఏ భూములను చదును చేయడానికి యత్నించగా.. విషయం తెలుసుకున్న హెచ్‌ఎండీఏ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మూడు ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసి, డ్రైవర్లు రషీద్, నందు, నిసార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కబ్జాకు యత్నించిన ఖలీద్, షాబాజ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరు నెలల క్రితం సుప్రీంకోర్టు అవి హెచ్‌ఎండీఏ భూములని తీర్పు చెప్పినా కూడా అక్రమార్కులు మాత్రం.. మా దగ్గర డాక్యుమెంట్లు ఉన్నాయని, మరో సారి ఆక్రమించడానికి యత్నించారు. దాంతో మరో సారి వివాదాస్పదమైంది. గతంలో నకిలీ ఇంటి పన్ను, రశీదులు సృష్టించి, నకిలీ డాక్యుమెంట్లతో కోర్టుకు వెళ్లిన సదరు వ్యక్తులు.. బోగస్ ఉత్తర్వులను తీసుకుని విలువైన భూములను కాజేయాలని చూశారు. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో భారీ భూబాగోతాన్ని తెలంగాణ ప్రభుత్వం చాకచక్యంగా తిప్పికొట్టింది. కోర్టు బోగస్ ఉత్తర్వులు, తప్పుడు రశీదుల గుట్టురట్టు చేసింది. ఆ భూములు ప్రభుత్వానివేనని.. పక్కా ఆధారాలతో సమర్థవంతంగా వాదనలు వినిపించింది. దాంతో సుప్రీంకోర్టులో కేసు గెలిచింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలోనే ట్రక్కు టెర్మినల్ నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని వివిధ సర్వే నెంబర్లలో హెచ్‌ఎండీఏ దాదాపు 214.02 ఎకరాల భూమిని సేకరించింది. ఈ మేరకు అప్పట్లో అవార్డు నంబర్ 1/1990, ఫైల్ నంబర్ 84/86 ను కూడా జారీ చేసింది. వీటిలో పైగా ప్రాపర్టీస్‌కు చెందిన భూములు కూడా ఉన్నాయి. సర్వేనెంబర్ 725/21లో 7ఎకరాల 31 గుంటలు, సర్వేనెంబర్ 725/23లో 10 ఎకరాల 12 గుంటలు, సర్వేనెంబర్ 725/34 గుంటలతో పాటు మరిన్ని కొన్ని సర్వేనంబర్ల భూములు తమవే అంటూ ఇద్దరు వ్యక్తులు ఆ భూములను తమ పూర్వీకులు పైగా ప్రాపర్టీస్ నుంచి వేలంలో కొనుగోలు చేశారని హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. వాటిలోని అంశాలను నిజాం ఆస్తుల వివాద మూలాలకు సంబంధించినవిగా కోర్టు భావించింది. ఆ పిటీషన్లు సీఎస్ 7 బ్యాచ్ కేసులుగా పిలిచే పిటీషన్లతో జతచేసి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయస్థానం.. అవి హెచ్‌ఎండీఏ భూములని తీర్పు వెలువరించింది. హైకోర్టులో కేసు ఓడిపోయిన అక్రమార్కులు తిరిగి సుప్రీంకోర్టుకు వెళ్లారు. అక్కడ కూడా ఆ భూములు హెచ్‌ఎండీఏ భూములని తీర్పు వచ్చింది. రూ.కోట్ల విలువైన భూములను దక్కించుకోవాలని దురుద్దేశంతో తిరిగి కబ్జాకు యత్నించారు. అక్రమార్కులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్జీఐఏ పోలీసులు హెచ్చరించారు.

రేపటి నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం


మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'స్వచ్ఛదనం.. పచ్చదనం' కార్యక్రమాన్ని ఈ నెల 5వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించనున్నామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. రోజువారీగా చేపట్టే వివరాలు కలెక్టరేట్‌లో శనివారం ఆయన వెల్లడించారు. ఈ నెల 5వ తేదీన ప్రజాప్రతినిధులు, నాయకులు, స్వయం సహాయక సభ్యులు, యువజన సంఘాలు, గ్రామపంచాయతీ కమిటీలతో సమావేశం నిర్వహించి, ర్యాలీ చేపడుతారు. ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ బడుల పరిసరాలను శుభ్రం చేయాలి. వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. వ్యక్తిగత శుభ్రత, సీజనల్‌వ్యాధులు, ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలు, పారిశుధ్యం, మొక్కల పెంపకంపై విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తారు. 6న తాగు నీటి వనరుల వద్ద పరిశుభ్రత, మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్, ఇంకుడు గుంతల నిర్మాణం, చెరువులు, కాలువల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడంపై వివరిస్తారు. 7న మురుగు కాల్వల్లో పూడిక తీయడం, నీరు నిలిచే ప్రాంతాల్లో మొరం పోయడం, ఖాళీ స్థలాల్లో మురుగును తొలగించడం కార్యక్రమాలను నిర్వహిస్తారు. 8న సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం, విషజ్వరాలపై సర్వే, దోమల నివారణకు చర్యలు, వీధి కుక్కల సర్వే, పిచ్చి కుక్కల నివారణకు తీసుకోవాల్సిన చర్యల కార్యక్రమాలను నిర్వహిస్తారు. 9న అన్ని కుటుంబాలు డ్రైడేగా పాటించాలని, ఇంటి ఆవరణలో నీటిని తొలగించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో శుభ్రం చేయాలని, వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటాలని కలెక్టర్ సూచించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

స్వచ్ఛదనం... పచ్చదనం కార్యక్రమ నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాలోని అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. అత్యవసరమైతే తప్ప.. అనుమతి లేకుండా సెలవు పెట్టినా.. నిర్వహణలో లోపాలున్నా చర్యలు తప్పవని పేర్కొన్నారు. పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులను సందర్శించి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలు, యువజన సంఘాలు, స్థానిక నాయకులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు అందరినీ భాగస్వాములను చేయాలన్నారు.

స్వచ్ఛదనం, పచ్చదనంలో మొక్కలు నాటాలి


మాట్లాడుతున్న జిల్లా ట్రైనీకలెక్టర్ ఉమాహారతి

దౌల్తాబాద్, ఆగస్టు 3: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి తెలిపారు. శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారిణి లావణ్య, ఎస్సై రవిగౌడ్ పాల్గొన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం


మొక్క నాటుతున్న మల్కాజ్‌గిరి ఎంపీ రాజేందర్

కీసర రూరల్, ఆగస్టు 3 : పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం వనమహోత్సవంలో భాగంగా నాగారం మున్సిపాలిటీ 14వ వార్డు శివశంకర్ నగర్ కాలనీలో నాయకులు, మున్సిపల్ సిబ్బంది, సెరినిటీ పాఠశాల విద్యార్థులతో కలిసి శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, లావణ్య, లక్ష్మి, డీఈఈ సుదర్శనం రఘు, మేనేజర్ చంద్రశేఖర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, బీజేపీ నాయకులు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, వేణు, రవీందర్‌రెడ్డి, అక్కాల సురేష్, జూపల్లి నరేష్, రాకేష్ పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

- ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంషాబాద్‌రూరల్, ఆగస్టు3: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి ఎంఎస్ గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అధ్యక్షతన బీజేపీ రంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుపొందాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కాక ముందే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, దానిని బీజేపీ ఆయుధంగా వాడుకోవాలని సూచించారు. బీజేపీ ప్రతి నాయకుడూ ప్రజల్లో ఉండి ప్రజాసమస్యలపై పోరాటం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదని, పార్లమెంట్‌లో తెలంగాణ పేరు వినిపించలేదని కొందరు నాయకులు విమర్శలు చేస్తున్నారని, వాటిని తిప్పి కొట్టాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాని సూచించారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మహేశ్వరం ఎమ్మెల్యేగా పోటీ చేసిన అందె శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేంరాజ్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షుడు నందకిశోర్, మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి సన్మానం

పార్లమెంట్‌లో మన రాష్ట్రం తరుపున బీజేపీ విప్‌గా నియమితులైన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపల్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. రాష్ట్రం తరపున పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించడం చాలా సంతోషంగా ఉందని వేణుగోపాల్ అన్నారు. వీరితోపాటు పలువురు జిల్లా నాయులు ఎంపీని సన్మానించారు.

నాగారం వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ సస్పెన్షన్

ధారూరు, ఆగస్టు 3: వైద్యం అందక మృతి చెందిన మేకను పశువైద్యశాల బోర్డుకు వేలాడదీసిన సంఘటనలో మండల పరిధిలోని నాగారం పశువైద్యశాల వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ (వీఎల్‌వో) సురేందర్ నాయక్ సస్పెండ్ అయ్యారు. నాగారంలో గత నెల 31న రైతు దశరథం మేకను వైద్యం కోసం పశువైద్యశాలకు తీసుకువచ్చాడు. పశువైద్యశాలలో సిబ్బంది లేక వైద్యం అందక మేక మృతి చెందింది. దీంతో ఆగ్రహించిన రైతు మేక కళేబరాన్ని పశువైద్యశాల బోర్డుకు వేలాడదీసి, నిరసన తెలిపాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు ఈ సంఘటనపై విచారణ జరిపారు. వీఎల్‌వో సురేందర్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఆదిభట్ల, ఆగస్టు 3: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫైర్‌స్టేషన్ ఇబ్రహీంపట్నం డివిజన్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు - నివారణ చర్యలపై నాగేశ్వర్ రావు, లీడింగ్ ఫైర్‌మెన్ ఖదీర్ సిబ్బందితో కలిసి శనివారం ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో ఓ ప్రైవేట్ హైస్కూలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రమాదం జరిగితే ఆందోళన చెందకుండా వెంటనే డైల్ 101కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ చైర్మన్ లక్క రాజు శ్రీనివాసరావు, డైరక్టర్ లక్క రాజు రాధిక ఉపాధ్యాయులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం అందించాలి

చేవెళ్ల, ఆగస్టు 3: కేరళ వరద బాధితులకు సహాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.రామస్వామి తెలిపారు. కేరళ రాష్ట్రంలోని వయనాడు వరద బాధితుల కోసం శనివారం చేవెళ్లలో సీపీఐ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రంలోని వయనాడు ప్రాంతంలో ప్రకృతి విపత్తు జరిగిందన్నారు. అక్కడ ప్రజలు కష్టల్లో ఉన్నారని, వారికి సహాయం చేయాలని కోరారు. చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నక్క జంగయ్య, సుధీర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల, నాయకులు కృష్ణగౌడ్, సాయిలు, నర్సింలు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల నిరసన

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ శనివారం ఇబ్రహీంపట్నంలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సుప్రీంకోర్టు ఈనెల ఒకటిన ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తున్నామని నాయకులు అన్నారు. మాలల సర్వతోముఖాభివృద్ధికోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. ఈ నెల 6 7, 8 తేదీల్లో ఢిల్లీలో జరిగే సామాజిక చైతన్య దీక్షలకు పెద్దఎత్తున తరలి వెళ్లనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళి సంఘాల నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ భర్త జగన్, ఈగల రాములు, హనుమండ్ల కృష్ణ, అంగద్ కుమార్, బండి మహేష్, మాదరి శివకుమార్, నర్సింగ్‌రావు, చిక్కుడు గుండాలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

- విద్యార్థులకు ఇబ్బందులు కలిగించినా, ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు
- వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ


చెన్‌గోముల్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణ

పూడూరు, ఆగస్టు 3 : గ్రామాల్లో గంజాయిపై ఉక్కుపాదం మోపాలని వికారాబాద్ జిల్లా ఎస్పీనారాయణ పోలీసులను ఆదేశించారు. శనివారం పూడూరు మండల పరిధిలోని చెన్‌గోముల్ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అక్కడున్న కేసుల వివరాలు, ఫైళ్లు, రికార్డులు, సిబ్బంది హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఎస్పీ అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో విజిట్‌కు వెళ్లినప్పుడు అక్కడ క్షుణ్ణంగా పరిశీలించి అధిక మొత్తంలో సమాచారాన్ని రాబట్టాలని తెలిపారు. అదేవిధంగా సిబ్బంది ఒక గ్రామాన్ని సందర్శించినప్పుడు అక్కడ కొందరు వ్యక్తులతో పరిచయాలు పెంపొందించుకుని, అక్కడ జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై సమాచారం రాబట్టాలన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పూడూరు ప్రాంతం హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో ఇక్కడ భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, అటువంటి కేసులు ఏమైనా వస్తే వాటిపైన జాగ్రత్త వహించాలని అన్నారు. గ్రామాల్లో, ఒకప్పుడు పట్టణాల్లో తెలియకుండా గంజాయి, డ్రగ్స్ సులువుగా అక్రమ రవాణా జరుగుతున్నాయన్నారు. అలాంటి గ్రామాల్లో వారిని గుర్తించాలని అన్నారు. అలాగే ఎక్స్‌పైరీ డేట్ లేని తినుబండారాలు వస్తున్నాయని, వాటిని సరఫరా చేసే వ్యక్తులను, తయారు చేసే కంపెనీలను గుర్తించి, వాటిని పూర్తిస్థాయిలో నిలిపివేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

హైదరాబాద్-మన్నెగూడ హైవే రోడ్డు విస్తరణ ప్రారంభదశలో ఉన్నందున, ఈ ప్రాంతం సింగిల్ రోడ్డు కావడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కావున ఈ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చెన్‌గోముల్ వచ్చిన ఎస్పీని పరిగి డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డిలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసులు నమోదు చేయాలి

వికారాబాద్, ఆగస్టు 3 : జిల్లాలో విద్యార్థులకు ఇబ్బందులు కలిగించినా, ర్యాగింగ్ చేసినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.నారాయణ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లాలో పనిచేస్తున్న షీ టీం, భరోసా సెంటర్, కళాజాతా బృందం అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో షీ టీం, కళాజాతా బృందం, భరోసా కేంద్రం సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ఎవరు కూడా ఆత్మహత్యలకు పాల్పడొద్దని సూచంచారు. జిల్లాలో ఎవరైనా ఆడ పిల్లల జోలికి వెళ్లినా, విద్యార్థులను ర్యాగింగ్ చేసినా కఠనమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎ.వీరేందర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ క్రైం కో-ఆర్డినేషన్ సెంటర్ డీఎస్పీ ప్రశాంత్ రెడ్డి, షీటీం, భరోసా కళాజాతా బృందం అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం కూల్చివేత


ఎక్స్‌కవేటర్లతో రైసుమిల్లు షెడ్డును కూల్చివేస్తున్న దృశ్యం

బొంరాస్‌పేట్, ఆగస్టు 3: ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న రైసుమిల్లు షెడ్డును అధికారులు శనివారం కూల్చివేశారు. దుద్యాల గ్రామ పరిధిలో రాఘవేంద్ర రైసుమిల్లును అధికారులు ఎక్స్‌కవేటర్ల సహాయంతో తొలగించారు. దుద్యాల పరిధిలోని మహబూబ్‌నగర్-చించోలి హైవే రోడ్డు పక్కన దుద్యాల గేటు సమీపంలో (సర్వే నెం.1090లో ప్రభుత్వ భూమి, సర్వే నెం.1089లో ప్రైవేట్ భూమి) రాఘవేంద్ర రైసుమిల్లును నిర్మించారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు రైసుమిల్లు షెడ్డు సగభాగం ప్రభుత్వ భూమిలో ఉందంటూ నెల రోజుల క్రితం సంబంధిత రైసుమిల్లు యజమానికి నోటీసులు అందించారు. శనివారం తహసీల్దార్ దానయ్య, డీపీవో జయసుధ, డీఎల్‌పీవో శంకర్‌నాయక్, ఎంపీవో మహేశ్‌బాబు, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ల సహాయంతో ప్రభుత్వ భూమిలో రేకుల షెడ్డును కూల్చివేశారు. ఈ సందర్భంగా బొంరాస్‌పేట ఎస్సై అబ్దుల్‌రవూఫ్, దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్‌తో పాటు 20 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ రైసుమిల్లు మహబూబ్‌నగర్ జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కుటుంబ సభ్యులకు సంబంధించినదిగా సమాచారం.


సీహెచ్‌సీ భవనం చుట్టూ చెట్లతోపాటు ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

అపరిశుభ్రంగా సీహెచ్‌సీ భవనం

బషీరాబాద్, ఆగస్టు 3: బషీరాబాద్‌లోని సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) భవనం చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఆస్పత్రి పరిసరాలు ఆహ్లాదంగా ఉండాల్సి ఉండగా ఆ పరిస్థితి ఇక్కడ కనిపించడంలేదు. ఈ భవనం పక్కన, చుట్టూ గుబురుగా పెరిగిన పిచ్చిమొక్కలు చిట్టడివిని తలపిస్తోంది. ఏపుగా పెరిగిన ముళ్లకంపల కొమ్మలు ఆస్పత్రి భవనం కిటికీలోంచి లోపలికి వస్తున్నాయి. పిచ్చి మొక్కలతో పాటు హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ భవనం వెనకాల శిథిలావస్థలో నిజాం కాలంనాటి భవనం ఉంది. ఈ భవనంలో పాములు తిష్ఠవేసి తరుచూ సీహెచ్‌సీ పరిసరాల్లో సంచరిస్తున్నాయని ఇక్కడి వైద్య సిబ్బంది చెబుతున్నారు.

అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి

- ఎమ్మెల్యేను కోరిన మున్సిపల్ పాలకవర్గం
- గతానికి భిన్నంగా సాధారణ సమావేశం
- 33అంశాలకు ఏకగ్రీవ తీర్మానం

తాండూరు, ఆగస్టు 3: తాండూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని పాలకవర్గం ఎమ్మెల్యేను కోరింది. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశం గతానికి భిన్నంగా సాగడం విశేషం. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రతీ కౌన్సిలర్, కోఆప్షన్‌సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఐదు నెలల తర్వాత జరిగిన ఈ సమావేశంలో సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిగింది. వీధిదీపాలు, మురుగు కాల్వలు, మంచి నీటి సమస్యలపై సభ్యులందరూ సమస్యలను లేవనెత్తారు. అంగన్‌వాడీ భవనాలకు ప్రహరీ నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కౌన్సిలర్లు సోమశేఖర్, సంగీతా ఠాకూర్ కోరారు. భద్రేశ్వర్‌చౌక్‌లో వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని, కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కౌన్సిలర్ లావణ్య కోరారు. ఆదర్శ నగర్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి వరద నీటి సమస్యను పరిష్కరించాలని వైస్ చైర్‌పర్సన్ దీపా, కౌన్సిలర్లు పూజాలు, నీరజాబాల్‌రెడ్డి కోరారు. అదే విధంగా 10వ వార్డులో వరద ఇబ్బందులు తీర్చాలని వార్డు కౌన్సిలర్ రత్నమాల కోరారు. విధుల నుంచి తొలగించిన ఏడుగురు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, తప్పుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలే తప్పా తొలగించవద్దని కౌన్సిలర్ సోమశేఖర్, నీరజా బాల్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రాజీవ్ గృహ, ఇందిరమ్మకాలనీలకు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రత్యేకంగా మున్సిపాలిటీ నుంచి నిధులు కేటాయించి మురుగు కాల్వలు, సీసీరోడ్లు నిర్మించాలని కౌన్సిలర్ వెంకన్నగౌడ్ కోరారు. ఎజెండాలోని 34అంశాలుండగా 33అంశాలను ఏకగ్రీవంగా కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఇంటింటికీ చెత్త సేకరణ ప్రైవేటీకరణ చేసే విషయంలో ప్రజలు సహకరించాలని బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ శోభారాణి, బీజేపీ కౌన్సిలర్ సాహు శ్రీలత, కాంగ్రెస్ కౌన్సిలర్ నీరజా బల్‌రెడ్డిలు అభిప్రాయపడ్డారు. శానిటేషన్ సిబ్బంది పెంచుకునే అవకాశాలను పరిశీలించాలని కౌన్సిలర్ సోమశేఖర్ సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరు మున్సిపాలిటీని పార్టీలకతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెప్పారు. కౌన్సిలర్ల అభిప్రాయం మేరకు ప్రణాళికలో పనులను పొందుపర్చాలని కమిషనర్ ఆదేశించినట్లు ఎమ్మెల్యే వివరించారు. మున్సిపాలిటీ నిధులతో పాటు వార్డు అభివృద్ధికి తన కోటా నుంచి నిధులిస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కమిషనర్ విక్రం సింహారెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ దీపా, ఫ్లోర్ లీడర్లు సోమ శేఖర్, మధుబాల, అంతారం లలిత, శోభారాణి, సాజీద్ అలీ, ఇన్‌చార్జి డిప్యూటీ ఈఈ ఖాజా హుస్సేన్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, టీపీవో పవన్, కౌన్సిలర్లు ఎం.రాఘవేందర్, సింధూజ, రత్నమాల, ప్రభాకర్ గౌడ్, రవిరాజు ఉన్నారు.

వందల కోట్లతో అభివృద్ధి: ఎమ్మెల్యే

తాండూరు: నియోజకవర్గంలో వందల కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వెల్లడించారు. తాండూరు మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదట విడతగా సోమవారం (రేపు) తాండూరు ప్రాంతానికి అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు వస్తున్నట్లు తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, వైస్ చైర్‌పర్సన్ దీపా నర్సింహులు, కౌన్సిలర్లు నీరజా బాల్‌రెడ్డి, సంగీతా ఠాకూర్, సి.ప్రవీణ్‌కుమార్, రత్నమాల, మధుబాల, ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, శేఖర్ ఉన్నారు.

కార్మికులకు కిట్లు అందజేత

తాండూరు మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పని చేస్తున్న కార్మికులకు దుస్తుల కిట్లను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీపాలతో కలిసి కార్మికులకు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు నీరజ బాల్‌రెడ్డి, రత్నమాల, సింధూజ, సంగీత ఠాగూర్, రామకృష్ణ, ప్రభాకర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, బోయ రవి రాజు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్

నాలున్నరేళ్లుగా వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్న రీతిలో విభేదాలున్నాయి. వారే ఒకరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మరొకరు వైస్ చైర్‌పర్సన్ దీప. గతంలో సొంత పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా ఉన్న ఈ ఇద్దరు మున్సిపాలిటీలో ఒకే వేదికపైకి వచ్చిన సందర్భాలు లేవు. శనివారం నిర్వహించిన మున్సిపాలిటీ సమావేశం, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో ఇద్దరూ ఒకే వేదికపై కూర్చోవడం చర్చనీయాంశమైంది. ఇరువురు కార్మికులకు మెటీరియల్ అందజేశారు. పార్టీలకు అతీతంగా ఎలాంటి గొడవలు లేకుండా కౌన్సిలర్లు అందరూ అభివృద్ధే ధ్యేయంగా కలిసి ముందుకు వెళ్లాలన్న సాంకేతాన్ని ఎమ్మెల్యే ఇచ్చారని చర్చ జరిగింది.

మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తాం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్

వికారాబాద్, ఆగస్టు 3: వికారాబాద్ మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేష్ అన్నారు. మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్‌సభ్యులు 41అంశాలతో కూడిన ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో ఉన్న సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. పట్టణాభివృద్ధి, పారిశుధ్య సమస్యలపై సలహాలు సూచనలు చేశారు. మున్సిపల్ సాధారణ సమావేశం అనంతరం చైర్‌పర్సన్ ఛాంబర్‌లో మీడియా సమావేశంలో చైర్‌పర్సన్ మంజులరమేష్ మాట్లాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో వికారాబాద్ మున్సిపాలిటీని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళతామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ శంషాద్‌బేగం, కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు కో-ఆప్షన్ సభ్యులు మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు


కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

తాండూరు రూరల్, ఆగస్టు 3: ఉద్యోగంలో ఉత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని పంచాయతీరాజ్ తాండూరు డివిజన్ ఈఈ సత్యనారాయణరెడ్డి, వికారాబాద్ డివిజన్ ఈఈ ఉమేష్‌కుమార్‌లు అన్నారు. పీఆర్ తాండూరు-పెద్దేముల్ డీఈ వెంకట్‌రావు పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమం శనివారం పట్టణంలోని తులసీ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈలు మాట్లాడుతూ డీఈ వెంకట్‌రావు మృదుస్వభావి, మంచి మనిషి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఈ కృష్ణ జోషి, డీఏవో రవికుమార్, ఏఈలు సంతోష్, నందిని, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, ధారాసింగ్, విజయలక్ష్మీపండరి, మేఘనాథ్‌గౌడ్, వడ్డె శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం

పరిగి, ఆగస్టు 3: నిరుద్యోగులకు జాబ్‌క్యాలెండర్ ప్రకటించిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం సాయంత్రం పాలాభిషేకం చేశారు. పరిగి పట్టణంలోని అమరవీరుల చౌరస్తాలో పిహెచ్‌డి స్కాలర్ ఓయూ జేఏసీ నాయకులు రాంచంద్రయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధానకార్యదర్శి హన్మంత్‌ముదిరాజ్, జిల్లా కార్యదర్శి కొమిరె రాంచంద్రయ్య, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణలు మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన ఏకైక ప్రభుత్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనెం అంజనేయులు, అశ్రఫ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠం


బొంరాస్‌పేట్: తల్లిపాల ఆవశ్యకత వివరిస్తున్న వెంకటేశ్వరమ్మ

బొంరాస్‌పేట్, ఆగస్టు 3: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వరమ్మ, జిల్లా కో ఆర్డినేటర్ హర్షిత్‌రెడ్డి బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, జయశ్రీపాల్గొన్నారు.

శామీర్‌పేట: అలియాబాద్‌లోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు శకుంతల, జయప్రభ, భాగ్యలక్ష్మి పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పూడూరు: మండలంలోని పెద్ద ఉమ్మెంతల్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరళ, ఆయాలు హనీఫా బేగం, అనూష, వినోద్, తల్లులు, గర్భిణులు, బాలింతలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. అనంతరం 6నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసనం చేశారు.

మోమిన్‌పేట్: మక్తతండాలో బాలింత మహిళలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, నవజాత శిశువు ఆరోగ్యంగా పెరిగేందుకు ఎంతో దోహదపడతాని అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు.

కీసర: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల విశిష్టతను, ముర్రుపాల ప్రాముఖ్యతను చిన్నారుల తల్లులకు వివరించారు.

బంట్వారం: బిడ్డకు తల్లిపాలు ఎంతో మేలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. కోట్‌పల్లి మండలంలోని బుగ్గాపూర్‌లో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు కలిగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం హేమలత, అంగన్‌వాడీ టీచర్ పారిజాతం పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

దౌల్తాబాద్, ఆగస్టు 3: సుల్తాన్‌పూర్ గ్రామంలో ఇటీవల మొహర్రం ఉత్సవాల్లో భాగంగా పీర్ల ఊరేగింపులో డప్పు కొట్టలేదని కక్షతో దళితులపై దాడికి పాల్పడి, కిరాణా దుకాణంలో సరుకులు ఇవ్వకుండా అడ్డుకుంటున్న అగ్రకుల పెత్తందారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు ఉప్పలి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్సై రవి గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట బాధితులు అంజి, అంజనేయులు, పెంటప్ప, భీమమ్మ పాల్గొన్నారు.

వీరులను స్మరించుకుందాం

కొడంగల్, ఆగస్టు 3: వాడవాడలో దళిత వీరులను స్మరించుకుందామని కుల నిర్మూలన సమితి జిల్లా అధ్యక్షుడు ఏర్పుల చంద్రప్ప పిలుపునిచ్చారు. శనివారం కొడంగల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏ దేశంలో లేని కుల వ్యవస్థ భారతదేశంలో కొనసాగిస్తూ అగ్రకుల మనువాదులు ఎన్నో సార్లు దళితులపై దారుణ మారణకాండలు కొనసాగిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతోనే కారంచెడు నుంచి కల్వకోలు నామాల బాలస్వామి వరకు మూకుమ్మడి హత్యలు, సజీవదహనాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు నిరసనగా ఈనెల 4న(ఆదివారం) కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు జయరాజు, ప్రధాన కార్యదర్శి అభినవ్‌తో పాటు రాష్ట్ర కమిటీ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ నాయకులు అంజిలప్ప, అంజి, వెంకటయ్య పాల్గొన్నారు.

రేపటి వరకు రైతు బీమా దరఖాస్తుల గడువు

పరిగి, ఆగస్టు 3: కొత్తగా పట్టాపాసుపుస్తకాలు వచ్చిన రైతులు రేపటి(సోమవారం) వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని పరిగి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు లక్ష్మీకుమారి తెలిపారు. రేపటితో గడువు ముగుస్తుందన్నారు. జూలై 28 వరకు జారీ పట్టా రైతులందరూ రైతు బీమాకు అర్హులని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు అవసరం లేదన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా విజయేందర్


విజయేందర్

ధారూరు, ఆగస్టు 3: ధారూరు మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విజయేందర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన విజయ్ నాయక్ బదిలీ అయ్యారు. తాండూర్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న విజయేందర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఆమెరికా పర్యటనకు ఎమ్మెల్యే

పరిగి, ఆగస్టు 3: పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి శనివారం అమెరికా పర్యటనకు వెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి బృందం 12రోజుల పర్యటనలో భాగంగా అమెరికా పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ బృందంలో పరిగి ఎమ్మెల్యే కూడా ఉన్నారు. అక్కడ జరిగే పారిశ్రామికవేత్తల సమావేశంలో సీఎంతోపాటు, రామ్మోహన్‌రెడ్డి పాల్గొంటున్నారు. ఈనెల 14న తిరిగి పరిగికి రానున్నారని పార్టీవర్గాలు తెలిపాయి.

అడ్డగోలు పార్కింగ్‌లు వద్దు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 3: మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి పరిసరాల్లో అడ్డగోలుగా ఆటోలు పార్కింగ్ చేస్తే కఠినచర్యలు తప్పవని మేడ్చల్ ట్రాఫిక్‌పోలీస్ సీఐ హనుమాన్ గౌడ్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు శనివారం సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. జాతీయ రహదారి పనులు పట్టణంలోకి ప్రవేశించటంతో తరుచూ ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతుందని తెలిపారు.

పూర్తిస్థాయి రుణమాఫీ కాలేదని ఫిర్యాదు

దౌల్తాబాద్, ఆగస్టు 3: ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీలో మొదటి విడతలో రూ.లక్ష మాఫీలో 50శాతం మాత్రమే అయిందని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కూర వెంకటయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీలో రేషన్‌కార్డును ప్రామాణికంగా చేయడం సరైంది కాదని, పట్టాపాసు పుస్తకం ఆధారంగా మాఫీ చేయాలని కోరారు.

సంక్షిప్తంగా..

- **మేడ్చల్ టౌన్:** నిరుద్యోగ యువకులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం అభినందనీయమని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు మేడ్చల్‌లో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాకేష్, శ్రీధర్, బ్రహ్మ, పాండు. శశి, విజయ్, ఆశిష్ పాల్గొన్నారు.
- **తాండూరు రూరల్:** వయనాడ్ వరద బాధితులకు అండగా ఉందామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. తాండూరులో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు, యాదప్ప, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.
- **కొడంగల్:** కొడంగల్‌లోని అప్పాయిపల్లి శివారులో చేపట్టే మెడికల్, పశువైద్య కళాశాలల కోసం భూసేకరణ నిమిత్తం శనివారం జిల్లా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే నెం.19 రైతులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, భూములు కోల్పోతున్న తమకు భూమికి భూమి, 200 గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.
- **దోమ:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని దోమ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ చెత్తాచెదారం నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను డైరెక్టర్లు వెంకటయ్య, యాదయ్యగౌడ్ కోరారు.
- **తాండూరు రూరల్:** అంతారం ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శనివారం పాఠశాల ఆవరణలో గ్రామస్తుల ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శేఖర్, రాములు సన్మానించారు.
- **కీసర:** రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. జూబ్లీహిల్స్ విద్యా సంస్థల డైరెక్టర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఎమ్. వరలక్ష్మి, ప్రిన్సిపాల్ పద్మాజారావు, వైస్‌ప్రిన్సిపాల్ నందితలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- **ఘట్‌కేసర్ రూరల్:** కొర్రెముల శ్రీచైతన్య పాఠశాలలో శనివారం గ్రీన్ కలర్ డే సెలబ్రేషన్స్ జరిగాయి. శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేష్‌యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
- **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లిలో మైసమ్మగూడ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్స్ కళాశాల విద్యార్థులతో కలిసి మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి లత శనివారం స్థానికంగా గో గ్రీన్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు.
- **బంట్వారం:** సర్వేనెంబర్-178 లోని తమ పొలాలకు వెళ్లే రోడ్డును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని బంట్వారం మండలం బస్వాపూర్ గ్రామ రైతులు శనివారం పోలీసులను ఆశ్రయించారు.
- **మేడ్చల్ టౌన్:** మేడ్చల్‌లోని 14వ వార్డులో రూ.3.50లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను స్థానిక కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చైర్‌పర్సన్ మర్రిదీపిక నర్సింహారెడ్డి శనివారం ప్రారంభించారు.
- **మేడ్చల్ టౌన్:** ఎస్సీ వర్గీకరణకు సుదీర్ఘ పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి మండలంలోని డబీల్‌పూర్‌లో శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.
- **బొంరాస్‌పేట్:** దుద్యాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 250 మంది విద్యార్థులకు తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ శనివారం స్టీలు గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయరామారావు, ఉపాధ్యాయులు మల్లప్ప, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.
- **తాండూరు:** జాతీయ స్థాయి లలిత కళాపోటీల్లో తాండూరు శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ మదార్‌ను సన్మానించారు. హైదరాబాద్‌లో శ్రీ రాజ రాజేశ్వర భారత కళా సమితి వారి ఆధ్వర్యంలో బిర్లా సైన్స్ సెంటర్, భాస్కర ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్రకళ (పొట్రెయిర్ ఆర్ట్)లో రాణిస్తున్న మదార్‌కు ప్రత్యేక ఆహ్వానం దక్కింది. ఆజాది కా అమృత్ మహోత్సవ్ 75 సంవత్సరాల వేడుకలలో ఇండిపెండెన్స్ డే అవార్డును ఈయన దక్కించుకున్నారు. సుప్రసిద్ధ నృత్యకారులు డాక్టర్ మోహన్ జి.డాక్టర్ రాధా మోహన్ వెయ్యి మంది కళాకారులు హాజరయ్యారు.
- **మేడ్చల్ టౌన్:** మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో ఇంటింటికి తిరిగి చెత్త సేకరించటానికి కాంట్రాక్టు పద్ధతిలో వాహనాలు నడపదలచిన వారు సంప్రదించాలని కమిషనర్ నాగిరెడ్డి కోరారు.
- **తాండూరు రూరల్:** తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి సందీప్ తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా వచ్చారు. అదేవిధంగా తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు ఆర్ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గోపీని ఆర్ఐ గా ప్రభుత్వం నియమించింది. హైదరాబాద్ నుంచి మరో ఆర్ఐ ప్రదీప్ తాండూరుకు వచ్చారు. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న డీటీ, ఆర్ఐ పోస్టులు భర్తీ అయ్యాయని తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. కేవలం సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉందన్నారు.

క్రైం కార్నర్

బకెట్‌లో పడి 11నెలల శిశువు మృతి


కూతురి మృతదేహాన్ని తీసుకెళ్తున్న ధర్మేందర్

పరిగి, ఆగస్టు 3: నీళ్ల బకెట్‌లో పడి 11నెలల ఆడ శిశువు మృతిచెందిన ఘటన వికారాబాద్ జిల్లా పరిగిలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బిహార్ రాష్ట్రానికి చెందిన ధర్మేందర్-వైశాలి దంపతులు వలస వచ్చి పరిగిలోని టీచర్స్ కాలనీలో ఉంటున్నారు. ధర్మేందర్ పరిగి శివారులో గల ఓ స్టీల్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం వైశాలి ఇంటి ముందు బట్టలు ఉతుకుతుండగా వారి 11 నెలల పాప అక్కడే ఆడుకుంది. పాపను అక్కడే వదలి వైశాలి బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఈ లోగా చిన్నారి ఆడుకుంటూ నీళ్ల ఉన్న బకెట్ వద్దకు వెళ్లి అందులో తలకిందులుగా పడిపోయింది. బాత్‌రూమ్ నుంచి బయటికొచ్చిన వైశాలి పరుగున వెళ్లి పాపను బకెట్ నుంచి తీసింది. కొన ఊపిరితో ఉన్న శిశువును ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. ధర్మేందర్-వైశాలి దంపతులకు పెళ్లైన చాలా ఏళ్లకు పుట్టిన పాప ఇలా చనిపోవడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు.

స్టీల్ కంపెనీలో అగ్ని ప్రమాదం.. కార్మికులకు గాయాలు


స్టీల్ పరిశ్రమలో చెలరేగుతున్న మంటలు

పరిగి, ఆగస్టు 3: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో గల సుగుణ స్టీల్ పరిశ్రమలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. కంపెనీలో పర్నీస్ బట్టి పేలి మంటలు చెలరేగాయి. ఈ అగ్ని ప్రమాదంలో పలువురు కార్మికులకు తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. ప్రమాద ఘటనపై పరిశ్రమ యజమాన్యం గోప్యంగా ఉంచింది. ప్రమాదంపై సిబ్బంది, కార్మికులు యజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా స్పందంచలేదు. ఈ కంపెనీలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్టీల్ కంపెనీ ప్రారంభం నాటి నుంచి అగ్ని ప్రమాదాల్లో ఇప్పటి వరకు పదుల సంఖ్యలో కార్మికులు మృతిచెందారు. ఈ ఫ్యాక్టరీలో ఎక్కువగా ఇతర రాష్ట్రాల కార్మికులే పనిచేస్తున్నారు. ఏం జరిగినా ఎవరూ అడగరనే ధీమాతోనే యాజమాన్యం వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రమాదాలపై రెవెన్యూ, కార్మిక శాఖల అధికారులకు తెలిసినా యాజమాన్యానికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. స్టీల్ కంపెనీలో జరుగుతున్న ప్రమాదాలపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

నల్లాలు ఎత్తుకెళ్లిన దుండగుడి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 3: ఇంట్లో తాళం పగులగొట్టి నల్లాలను ఎత్తుకెళ్లిన దుండగున్ని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టుచేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, బ్రూక్‌బాండ్ కాలనీలో నివాసముండే సిద్దగాని జనార్దన్ ఈనెల 1వ తేదీన నగరంలోని జియాగూడలో ఉండే బంధువుల ఇంటికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. మరుసటిరోజు రాత్రి 11:30గంటలకు స్థానికులు జనార్దన్‌కు ఫోన్ చేసి ఇంటితాళం తీసి ఉందని, ఇంట్లో శబ్దాలు వస్తున్నాయని సమాచారం ఇచ్చారు. ఇంటికి చేరుకున్న జనార్దన్ ఇంట్లోకి వెళ్లి చూడగా కిచెన్, వాష్‌రూంలో 10నల్లాలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు స్థానిక మైసమ్మగుట్ట వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓవ్యక్తిని అదుపులోకి తీసుకోని విచారించారు. జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం, ఆలీపురంకు చెందిన గంటా రమేష్‌రెడ్డి అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 10నల్లాలు బయటపడ్డాయి. నిందితున్ని అరెస్టుచేసి నల్లాలు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బాలుడిపై కుక్కదాడి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 3: పట్టణంలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలుడిపై కుక్క దాడిచేసింది. వివరాల్లోకి వెళ్తే.. ఎన్‌జీవో కాలనీవాసి రమేష్ కుమారుడు చరణ్(8) శనివారం తన ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్క దాడిచేసి గాయపరిచింది. చరణ్‌ను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

కొరియర్ పార్సిల్ పేరుతో రూ.లక్ష టోకరా

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 3: కొరియర్‌లో పార్సిల్ పేరుతో ఫోన్ చేయగా ఓ మహిళ తన బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష పంపించి మోసపోయింది. ఈ సంఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చౌదరిగూడకు చెందిన గొట్టిపాటి అనిత ఈనెల 2న ఫెడ్ఎక్స్ కొరియర్ కంపెనీ నుంచి ఫోన్ వచ్చింది. మీకు పార్సిల్ వచ్చిందని అందులో ముఖ్యమైన సామగ్రి ఉందని సదరు వ్యక్తి ఫోన్‌లో చెప్పాడు. అది నిజమేనని నమ్మిన అనిత ఆమె బ్యాంక్‌ఖాతా నుంచి రూ.లక్ష డబ్బులు పంపించింది. అంతటితో ఆగకుండా సదరు వ్యక్తి మరిన్ని డబ్బులు పంపిస్తే పార్సిల్ తెస్తానని చెప్పడంతో ఆమెకు అనుమానం వచ్చింది. దీంతో బాధితులను పోచారం ఐటీసీ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హైవోల్టేజీతో ఇళ్లల్లో విద్యుత్ పరికరాలు దగ్ధం

తాండూరు రూరల్, ఆగస్టు 3: విద్యుత్ హైవోల్టేజీతో ఇళ్లల్లో ఉన్న పరికరాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండలంలోని మిట్టబాస్పల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మిట్టబాస్పల్లి గ్రామ శివారులోని బర్కు కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి హైవోల్టేజీతో ఒక్కసారిగా ఇళ్లల్లో ఉన్న విద్యుత్ పరికరాలు టీవీ, ఫ్రీజ్, ఫ్యాన్లు దగ్ధమయ్యాయి. ఈ విషయమై లైన్‌మెన్ పద్మారెడ్డిని వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఫేజ్, న్యూటల్ కలపడంతో హైవోల్టేజీ వచ్చిందన్నారు.

ఉద్యమానికి సిద్ధమవుతున్న ఊరు జనం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 3: మండలంలోని నాలుగు గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాభిప్రాయాలు సేకరించకుండా ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో తమ గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు సిద్ధమైందని పూడూరు, మునీరాబాద్, గౌడవెల్లి, రాయిలాపూర్ గ్రామాల ప్రజలు అంటున్నారు. తమ గ్రామాలను దక్కించుకోవటానికి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ఉద్యమించడానికి సిద్ధమవుతున్నామని గ్రామస్తులు అంటున్నారు. ప్రభుత్వం విలీనం పట్ల పునరాలోచన చేసి నిర్ణయాన్ని మార్చుకోకపోతే న్యాయ స్థానాన్ని ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామని చెబుతున్నారు. సీఎం తన పాలనలో ఏదో ఒక కొత్తదనం తీసుకురావడానికి గ్రామపంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేసే పనికి శ్రీకారం చుట్టారని పూడూరు మాజీ సర్పంచ్ బాబు యాదవ్ ఆరోపించారు.

ఉపాధ్యాయుల ఆడిటింగ్ పూర్తి

బొంరాస్‌పేట్, ఆగస్టు 3: తెలంగాణ విద్యాశాఖ పాఠశాలలకు కేటాయించిన వివిధ పద్దుల కింద వివిధ రకాల నిధులపై శనివారం కొడంగల్ ఎమ్మార్సీలో ఆడిటింగ్ ఏర్పాటు చేశారు. మండలంలోని ఉపాధ్యాయులు తమ క్యాష్ బుక్కుల్లో పొందుపర్చి సమాచారాన్ని వివిధ రకాల బిల్లుల ద్వారా ఆడిటింగ్ పూర్తిచేసుకున్నారు. పాఠశాలలకు వివిధ పద్దుల కింద నిధులు, క్రీడామైదానాలు, యూనిఫాంకు సంబంధించిన నిధులను పాఠశాలలకు వినియోగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌరారం గోపాల్, మేరాజ్, శశిధర్, అనిల్‌కుమార్, శంకరప్ప, కేశవులు, రాజశేఖర్, రవీందర్‌గౌడ్, నారాయణ, భూదేవి, అంజురాథోడ్, రమాదేవి, పద్మ, కావేరి, లలిత, శోభారాణి, ఎమ్మార్సీ సిబ్బంది ఎండీ.గౌస్ పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

పూడూరు, ఆగస్టు 3: ప్రతీ గ్రామంలో ప్రభుత్వం రేపటి (సోమవారం) నుంచి 9వ తేదీ వరకు చేపట్టబోయే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీపీవో జయసుధ అన్నారు. పూడూరు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ ప్రత్యేకాధికారులు, అధికారులు, హైస్కూల్ హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఘట్‌కేసర్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛదనం-పచ్చదనంపై సమీక్షించారు.

ఘట్‌కేసర్ రూరల్: రేపటి నుంచి 9 వరకు మండలంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో మాట్లాడారు.

నవాబుపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో అనురాధ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గ్రామ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో చర్చించారు.

బంట్వారం: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి కమలాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో రాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ప్రత్యేకాధికారి పాల్గొని మాట్లాడారు.

బషీరాబాద్: స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయాలని బషీరాబాద్ మండల ప్రత్యేకాధికారి వీరభద్రరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమావేశమయ్యారు.